డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఒకరికి జైలు శిక్ష

కోటపల్లి, సెప్టెంబర్ 19 : కోటపల్లి మండల కేంద్రానికి చెందిన సైదల ప్రేమ్ సాగర్ మద్యం తాగి వాహనం నడుపుతూ పోలీసులకు పట్టుబడగా చెన్నూర్ మున్సిఫ్ కోర్టు జడ్జి ఏడు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పును వెలువరించినట్లు కోటపల్లి ఎస్ఐ రాజేందర్ గురువారం తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపిన, మైనర్లు వాహనాలు నడిపినా, రోడ్డు భద్రతా నియమాలు పాటించకపోయినా కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

ఇద్దరి రిమాండ్

లక్షెట్టిపేట, సెప్టెంబర్ 19: మండలంలోని బలరావుపేటలో రైతులను విద్యుత్ షాక్ పెట్టి చంపాలని పథకం వేసిన ఇద్దరు నిందితులను గురువారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు లక్షెట్టిపేట సీఐ నరేందర్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. హాజీపూర్ మండలం పెద్దంపేటకు నక్క ముజ్జన్నకు లక్షెట్టిపేట మండలం బలరావుపేటలో వ్యవసాయ భూమి ఉంది. ఆ భూమికి ఆనుకొని ఉన్న రోడ్డును రైతు కబ్జా చేసి సాగు చేసుకుంటున్నాడు. ఎదురుగా ఉన్న భూమికి చెందిన రైతు బసవయ్య కూడా ఇదే రోడ్డును కబ్జా చేసి సాగు చేసుకోగా ఆ ప్రాంత రైతులు ఎంసీకి ఫిర్యాదు చేసి కొలతలు వేసి రోడ్డును ఏర్పాటు చేసి హద్దులు వేయించారు. ఎంసీ చెప్పినట్లుగా బసవయ్య రోడ్డు కోసం భూమి ఇచ్చేందుకు ముందుకు వచ్చాడు. ముజ్జన్నకు ఇచ్చేందుకు ఇష్టంలేకపోవడంతో అప్పటి జడ్జీటీసీ ప్రస్తుత మాజీ జడ్జీటీసీ ముత్తె సత్తయ్యను ఆశ్రయించాయి. భూమి ఇవ్వకూడదని, ఆ రోడ్డుపై రైతులు నడవకుండా విద్యుత్ వైర్లు షాక్ వచ్చేలా అమర్చాలని సలహా ఇచ్చాడు. జడ్పీటీసీని ఏదైనా సమస్య ఉంటే చూసుకుంటానని ముజ్జన్నకు ధైర్యం చెప్పాడు. ఇదే క్రమంలో జూలై 31న రాత్రి ముజ్జన్న తన వ్యవసాయ బావికి ఉన్న స్టార్టర్‌తో రోడ్డుకు అడ్డం జీఏ వైరు, కరెంటు వైరుతో పాదులు పాతి కరెంటు షాక్ పెట్టాడు. ఈ విషయంపై ఆ ప్రాంత రైతు అల్లం శ్రీనివాస్ ఫిర్యాదు చేయగా ఎస్ఐ సతీశ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టి నిందితులను పట్టుకుని కోర్టులో హాజరుపర్చినట్లు సీఐ పేర్కొన్నాడు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

బెల్లంపల్లి, సెప్టెంబర్ 19 : పట్టణంలోని కన్నాల జాతీయ రహదారి వద్ద బుధవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని రెబ్బెన మండలానికి చెందిన ఎస్‌కే. చాంద్ (58) మృతి చెందినట్లు వన్‌టౌన్ ఎస్ఐ రమేశ్ తెలిపారు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చోరీ కేసులో ముగ్గురి అరెస్ట్

కోటపల్లి, సెప్టెంబర్19: బ్యాటరీ, సోలార్ ప్లేట్స్ దొంగతనం చేసిన ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రాజేందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వెల్మపల్లికి చెందిన గుర్రం సురేశ్ పత్తి చేనులో సోలార్ పవర్ నిమిత్తం సోలార్ బ్యాటరీ, సోలార్ ప్లేట్స్ ఏర్పాటు చేసుకున్నాడు. ఈ నెల 15న గుర్తు తెలియని వ్యక్తులు వాటిని దొంగిలించారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గురువారం ఎస్ఐ లక్ష్మీపురం వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన ఆటోను ఆపి తనిఖీ చేశారు. సరైన సమాధానం చెప్పకపోవడంతో అనుమానం వచ్చి అదుపులోకి తీసుకొని విచారించగా దొంగతనం చేసినట్లు పానెం సూర్యకిరణ్, గోట రాజేందర్, పానెం మనోజ్ ఒప్పుకున్నారు. ఈ నెల 13న రాత్రి సమయంలో పత్తి చేనులో గల బ్యాటరీ, సోలార్ ప్లేట్స్ దొంగతనం చేశారు. వాటిని అమ్ముకుందామని చెన్నూర్‌కు తరలిస్తుండగా పోలీసులు పట్టుకొని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

బీజేపీ నేతల దిష్టి బొమ్మల దహనం

మంచిర్యాల అర్బన్, సెప్టెంబర్ 19: రాహుల్ గాంధీపై బీజేపీ నేత తన్వీందర్ సింగ్ వ్యాఖ్యలకు నిరసనగా ప్రధాన మంత్రి మోడీ, హోం శాఖ మంత్రి అమిత్ షా, తన్వీవిందర్‌సింగ్ దిష్టిబొమ్మలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బెల్లంపల్లి చౌరస్తాలో దహనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కోట్నాక తిరుపతి, పీసీసీ ప్రధాన కార్యదర్శి చిట్ల సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు తూముల నరేశ్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు పెంట రజిత, తదితరులున్నారు.

చోరీకి యత్నం

బెల్లంపల్లి, సెప్టెంబర్ 19 : అనాథశరణాలయానికి పాత బట్టలు కావాలంటూ ఇంట్లో చొరబడి చోరీకి విఫలయత్నం చేసిన సంఘటన గురువారం బెల్లంపల్లిలో జరిగింది. ఓ ఆటోలో ఓ మహిళ, ఓ వ్యక్తి అనాథ శరణాలయానికి పాత బట్టలు ఇవ్వాలంటూ మైక్ ద్వారా ప్రచారం చేసుకుంటూ హన్మాన్ బస్తీకి వచ్చారు. ఓ ఇంట్లో ఒంటరిగా మహిళ ఉండడం గమనించిన వారు పాత బట్టలు ఇవ్వాలంటూ ఇంటి లోపలి దాకా వెళ్లారు. ఇంట్లోని వస్తువులు ఇవ్వాలని లేదంటే చంపేస్తామని బెదిరించారు. దీంతో గట్టిగా కేకలు వేయడంతో చుట్టు పక్కల వారు వచ్చి పట్టుకున్నారు. వన్‌టౌన్ పోలీసులు వచ్చి వారిని అదుపులోకి తీసుకొని లీస్‌స్టేషన్‌కు తరలించారు. విచారణ జరుపుతున్నామని ఎస్‌హెచ్‌వో దేవయ్య తెలిపారు.

వందేభారత్ రైలుకు హాల్టింగ్ ఇవ్వాలి

• దక్షిణ మధ్య రైల్వే జీఎంకు మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు వినతి

రైల్వే జీఎంకు వినతిపత్రం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్, సెప్టెంబర్ 19: నాగ్‌పూర్ – సికింద్రాబాద్‌ల మధ్య ప్రారంభమైన వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలుకు మంచిర్యాల రైల్వే స్టేషన్‌లో హాల్టింగ్ ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు కోరుతూ దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్‌ను కోరారు. ఈ మేరకు రైల్వే జీఎంను గురువారం సికింద్రాబాద్‌లోని రైల్వే నిలయంలో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు మాట్లాడుతూ కొత్తగా ప్రారంభించిన వందేభారత్ రైలుకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఏ ఒక్క రైల్వే స్టేషన్‌లో కూడా హాల్టింగ్ ఇవ్వలేదని అన్నారు. ముఖ్యంగా మంచిర్యాల లాంటి ముఖ్య పట్టణంలో హాల్టింగ్ ఇవ్వలేదని, ఇక్కడ అనేక పరిశ్రమలు, సింగరేణి బొగ్గు గనులు, వ్యాపార, వాణిజ్య కార్యాలయాలు, ఇతరత్రా అనేక రకాలైన వ్యాపారాలు జరుగుతున్నాయని, చుట్టుపక్కల ప్రాంతాలతో కలిపి మొత్తం మూడు లక్షలకు పైగా జనాభా కలిగి ఉంటుందన్నారు. అక్కడినుంచి రోజూ వేలాది మంది ప్రయాణికులు సికింద్రాబాద్, నాగ్‌పూర్ నగరాలకు వెళ్తుంటారని అన్నారు. వీరందరికీ వందేభారత్ రైలు హాల్టింగ్ ఉండడంతో ప్రయోజనం కలుగుతుందని, తక్కువ సమయంలో గమ్యస్థానాలను చేరుకునే అవకాశం ఉన్న ఈ రైలుకు మంచిర్యాలలో హాల్టింగ్ ఇవ్వాలని కోరారు. రైల్వేకు అత్యధిక ఆదాయం మంచిర్యాల రైల్వే స్టేషన్ నుంచే సమకూరుతుందని, ఈ విషయాన్నైనా పరిగణలోకి తీసుకోవాలని కోరారు.

స్కిల్స్ డెవలప్‌మెంట్‌పై అవగాహన

నస్పూర్, సెప్టెంబరు 19 : మంచిర్యాలలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం టాస్క్ తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. టాస్క్ ఇన్‌చార్జి దీప మాట్లాతూ విద్యార్థులు స్కిల్స్ నేర్చుకోవడం ద్వారా ఉన్నత స్థాయికి చేరుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నరేందర్‌రెడ్డి, టాస్క్ కో ఆర్డినేటర్ హరీశ్‌కుమార్, అధ్యాపకులు గంగయ్య, కుమారస్వామి, మహేశ్‌కుమార్, రసూల్, కరుణాకర్, కనకలక్ష్మి, మధుసూదన్, రాజు, అరుణ, నవీన్, పర్వా యాస్మిన్, విద్యార్థులు పాల్గొన్నారు.

కొండచిలువకు చికిత్స

నెన్నెల,సెప్టెంబర్19: నెన్నెల పోలీస్ స్టేషన్ ఆవరణలోని ఫెన్సింగ్ లో భారి కొండ చిలువ చిక్కుకొని ప్రాణాపాయ స్థితిలో ఉండగా గురువారం వెటర్నరి వైద్యులు చికిత్స అందించి దాని ప్రాణాలు కాపాడారు. హెడ్ కానిస్టేబుల్ విజయ్ సమాచారం ఇవ్వడంతో ఫారెస్టు అధికారులు, స్నేక్ క్యాచర్లతో వచ్చి పామును ఫెన్సింగ్ నుంచి బబయటకు తీశారు. గాయల వద్ద వెటర్నరీ వైద్యులు కుట్లు వేసి కొండచిలువ ప్రాణాలు కాపాడారు. చికిత్స అనంతరం ఎల్లారం బీట్ పరిధిలోని అడవిలో అటవీ అధికారులు వదిలి పెట్టారు. డిప్యూటీ రేంజర్ లక్ష్మీనారాయణ, బీట్ ఆఫీసర్లు, వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.

డీపీవో తనిఖీ

మందమర్రి రూరల్, సెప్టెంబర్ 19: మండలంలోని బొక్కలగుట్ట గ్రామ పంచాయతీని గురువారం డీపీవో వెంకటేశ్వరరావు తనిఖీ చేశారు. పారిశుధ్య పనులు, దోమల నివారణకు చేపడుతున్న చర్యలను పంచాయతీ సెక్రటరీ విద్యాలతను అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య పనులు, క్లోరినేషన్, రికార్డుల నిర్వహణపై సూచనలు చేశారు.

వరి పంట పరిశీలన

మందమర్రి రూరల్, సెప్టెంబర్ 19 : మండలంలోని పొన్నారం గ్రామంలో గురువారం వరి పంటను చెన్నూరు వ్యవసాయ సంచాలకులు బానోత్ ప్రసాద్, వ్యవసాయ శాఖాధికారి కిరణ్మయి పరిశీలించి పలు సూచనలు చేశారు. వారి వెంట ఏఈవోలు ముత్యం తిరుపతి, కనకరాజు, రైతులు పెంచాల మధు, రంజిత్ పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ ఏర్పాటు చేయాలని వినతి

జన్నారం, సెప్టెంబర్ 19 : మండలంలోని మొర్రిగూడ గ్రామ పంచాయతీలోని ఎస్సీ కాలనీ, గోండుగూడ కాలనీ వాసులైన 6 వందల మందికి నూతన గ్రామ పంచాయతీని ఏర్పాటు చేయాలని కోరుతూ ఎంపీడీవో శశికళకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రేమ్‌సాగర్, గంగారాం,జే కాంతరావు, పీ భీమయ్య, తదితరులున్నారు.

పీహెచ్‌డీ స్కాలర్‌గా మధుకర్

బొంతల మధుకర్

జన్నారం, సెప్టెంబర్ 19 :మండలంలోని కలమడుగు గ్రామానికి చెందిన బొంతల మల్లేశ్ కుమారుడు బొంతల మధుకర్ పీహెచ్‌డి స్కాలర్ అవార్డును పొందినట్లు తెలిపారు. యూజీ ప్రోగ్రామ్‌ను వ్యవసాయ కళాశాల పొలాసలో పూర్తి చేసి, పీజీ ప్రోగ్రామ్‌ను విశ్వభారతి శాంతినికేతన్ వెస్ట్ బెంగాల్ ప్రథమ శ్రేణిలో ఉతీర్ణత సాధించాడు. ప్రస్తుతం ప్రొఫెసర్ జయశంకర్ రాష్ట్ర విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ పరిశోధనలో భాగంగా మొక్కజొన్నలో డ్రోన్లను ఉపయోగించి కలుపు మందుల పిచికారీ పై చేస్తున్న పరిశోధనలో ప్రతిభకు గాను అవార్డును ప్రదానం చేసినట్లు తెలిపారు. న్యూఢిల్లీలో జరిగిన ఇండియన్ సొసైటీ ఆఫ్ అగ్రికల్చర్ సైన్స్ అండ్ టెక్నాలజీ రీసెర్చ్ ఆధ్వర్యంలో జరిగిన ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ అండ్ టెక్నాలాజికల్ విభాగంలో అవార్డు పొందినట్లు తెలిపారు.

చెరువు ఎఫ్‌టీఎల్ హద్దులు గుర్తించాలి

నస్పూర్, సెప్టెంబరు 19 : మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని ఊరు మందమర్రి దారిలోని ఊర చెరువు కబ్జాకు గురై అక్రమ నిర్మాణాలు జరిగాయని, వెంటనే చెరువు ఎఫ్‌టీఎల్ హద్దులను గుర్తించాలని కోరుతూ బీఎస్పీచెన్నూరు నియోజకవర్గ కన్వీనర్ ముల్కల్ల రాజేంద్ర ప్రసాద్ , బోర్లకుంట రాజలింగు గురువారం కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు.

ఓటరు సర్వేను పరిశీలించిన డిప్యూటీ కలెక్టర్

హాజీపూర్, సెప్టెంబర్ 52 : ఇంటింటా ఓటరు సర్వేను రాష్ట్ర ఎన్నికల ప్రధాన కార్యాలయం నుంచి వచ్చిన డిప్యూటీ కలెక్టర్ ప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ పరిశీలించారు. హైదరాబాద్ నుంచి ఎన్నికల నమోదు పరిశీలన బృందం నేరుగా మంచిర్యాల రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఆర్డీవో రాములుతో కలిసి మంచిర్యాల నియోజకవర్గం – 004లోని మంచిర్యాల, హాజీపూర్, లక్షెటిపేట, దండేపల్లి, హాజీపూర్ మండలాలకు చెందిన తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కలెక్టర్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని బూత్‌లెవల్ నిర్వహిస్తున్న ఇంటింటా వివరాలను తెలుసుకొని వారికి పలు సూచనలు, సలహాలను చేశారు. నస్పూర్ మండలంలోని పోలింగ్ స్టేషన్ నంబర్ 235, 236, 237లను పరిశీలించారు. బీఎల్‌వోల వద్ద ఉన్న ఓటరు నమోదు రిజిస్టర్‌లను పరిశీలించారు. మొబైల్ యాప్‌లో ఏవిధంగా ఓటరు నమోదు వివరాలను చేస్తున్నారు అని పరిశీలించారు. ఇంటి యజమానులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోతో పాటు ఎన్నికల సీనియర్ అస్టిటెంట్ గడియారం శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌వోలకు సహకరించాలి

బెల్లంపల్లి, సెప్టెంబర్ 19 : ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రత్యేక ఓటర్ సవరణ కార్యక్రమంలో భాగంగా ఓటర్ సవరణ, నమోదుకు ఇంటింటికీ వచ్చే బీఎల్వోలకు ప్రజలు సహకరించాలని ఎన్నికల కమిషన్ హైదరాబాద్ సీఈవో కార్యాలయ అధికారి రాంప్రసాద్ తెలిపారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పట్టణంలోని బూడిదగడ్డబస్తీలో ఆయన పర్యవేక్షించి బీఎల్వోల పనితీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌వో ప్రసాద్ రెడ్డి, ఆర్డీవో హరికృష్ణ, తహసీల్దార్ జ్యోత్స్న ఉన్నారు.

పారిశుధ్య పనులను పకడ్బందీగా చేపట్టాలి

• మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

విద్యార్థులతో చదివిస్తున్న మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

చెన్నూర్, సెప్టెంబర్ 19: మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల్లో పారిశుధ్య, అభివృద్ధి పనుల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని చెన్నూర్ కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. చెన్నూర్‌లోని మున్సిపల్ కార్యాలయం, తహసీల్ కార్యాలయం, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను గురువారం ఆకస్మికంగా సందర్శించారు. పట్టణంలోని వార్డుల్లో నిరంతరం పారిశుధ్య పనులు నిర్వహించాలని, అంతర్గత రహదారులు, మురుగు కాలవలలోని చెత్తా చెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించాలని ఆయన తెలిపారు.తాగు నీటి వనరుల వద్ద క్లోరినేషన్ చేయాలని తెలిపారు. అనంతరం తహసీల్ కార్యాలయాన్ని సందర్శించి రిజిష్టర్లు, రికార్డులను పరిశీలించి, ధరణి దరఖాస్తులపై పలు సూచనలు చేశారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి తరగతి గదులను, పరిసరాలను పరిశీలించి విద్యార్థులు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట తహసీల్దార్ మల్లికార్జున్, మున్సిపాలిటీ కమిషనర్ గంగాధర్ పాల్గొన్నారు.

జ్వరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

కోటపల్లి, సెప్టెంబర్ 19 : గ్రామాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తూ జ్వరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. కోటపల్లి మండలంలోని గురువారం పర్యటించిన కలెక్టర్ కుమార్ దీపక్ మొదటగా కోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. దవాఖానలో ఓపీని అడిగి తెలుసుకున్న కలెక్టర్ జ్వరాలు ప్రబలకుండా గ్రామాలలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని, పీహెచ్‌సీకి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యాధికారిణి అరుణశ్రీకి సూచించారు. అనంతరం కోటపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంను సందర్శించిన కలెక్టర్ తరగతి గదులను సందర్శించి విద్యార్థులను పలు ప్రశ్నలను అడిగి సమాధానాలు రాబట్టారు. పాఠశాల ప్రత్యేకాధికారిణి హరితకు పలు సూచనలు చేశారు. పాఠశాలలో విద్యాబోధన, మెనూ నిర్వహణ పై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కొండంపేట గ్రామ పంచాయితీని సందర్శించి పారిశుధ్య పనులపై పలు సూచనలు చేశారు. కొండంపేట, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. కులెక్టర్ వెంట తహసీల్దార్ మహేంద్రనాథ్, ఇన్‌చార్జి ఎంపీడీవో ముల్కల్ల సత్యనారాయణరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ నవీన్, పంచాయతీ కార్యదర్శి అనిల్, తదితరులు పాల్గొన్నారు.

పాఠాలు బోధించిన కలెక్టర్..

విధి నిర్వహణలో ఎప్పుడు బిజీగా ఉండే కలెక్టర్ కుమార్ దీపక్ కాసేపు ఉపాధ్యాయుడిలా మారారు. కోటపల్లిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, మండలంలోని కొండంపేట ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలను సందర్శించిన కలెక్టర్ విద్యార్థులో కాసేపు ఉల్లాసంగా గడిపారు. విద్యార్థులకు ప్రశ్నలు వేస్తూ సమాధానాలు రాబట్టడంతో పాటు వారితో నవ్వుతూ ముచ్చటిస్తూ వారికి ఉత్తేజపరిచారు. కొండంపేట అంగన్‌వాడీ కేంద్రానికి విద్యుత్ సరఫరా లేకపోవడాన్ని గమనించి వెంటనే ఏర్పాటు చేయాలని అంగన్‌వాడీ టీచర్‌ను ఆదేశించారు.

వరిధాన్యం సేకరణకు ఏర్పాట్లు

నస్పూర్, సెప్టెంబరు 19 : 2024–25 వానాకాలానికి సంబంధించి వరిధాన్యం సేకరణకు ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ మోతీలాల్‌తో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరిధాన్యం సేకరణ కోసం రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలో రూ.3.29 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచనా వేసినట్లు తెలిపారు. ఇందులో సన్నరకం 2.16 లక్షల మెట్రిక్ గన్నులు, దొడ్డు రకం 1,13,760 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడికి ముందస్తుగా కొనుగోలు చేసే ఏజెన్సీలైన జిల్లా గ్రామీణాభివృద్ధి, ప్రాథమికవ్యవసాయ సహకార సంఘం, మెప్మా, డీసీఎంఎస్‌లు తగు ఏర్పాట్లు చేయాలని సూచించారు. కొనుగోలు కోసం 82 లక్షల గన్నీ సంచులు అవసరం కాగా 21 లక్షల గన్నీ సంచులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మిగిలిన వాటిని సమకూర్చుకోవాలన్నారు. ఇతర ప్రాంతాల నుంచి అనుమతి లేని ధాన్యం జిల్లాలోకి రాకుండా అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి, డీఆర్‌డీవో కిషన్, లీడ్ డిస్టిక్ మేనేజర్ తిరుపతి, జిల్లా రవాణా అధికారి సంతోష్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి కల్పన, డీసీఎంఎస్ మేనేజర్ ప్రమోద్‌కుమార్, మార్కెటింగ్ అధికారులు పాల్గొన్నారు.

సీఎంఆర్ లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలి

జిల్లాలోని రైస్‌మిల్లులకు సామర్థ్యానికి అనుగుణంగా కేటాయించిన సీఎంఆర్ లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ మోతీలాల్, పౌరసరఫరా అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళతో కలిసి రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. సీఎంఆర్ లక్ష్యాలను పూర్తి చేయడంలో నిర్లక్ష్యం వహించిన రైసు మిల్లులపై చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ నెల 30లోగా లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేయాలి

• కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

మాట్లాడుతున్న ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ టౌన్,సెప్టెంబర్ 19: కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా సమగ్ర అభివృద్ధికి మండల ప్రత్యేక అధికారులు, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో జిల్లా పరిషత్ ప్రత్యేక అధికారి, కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన ప్రత్యేక సమావేశానికి అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్ల, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబుతో కలిసి హాజరై జిల్లా అధికారులు, ప్రత్యేక అధికారులతో జిల్లా అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మండలాలలో ఎంపీపీ, జడ్పీటీసీల పదవీకాలం ముగిసి వారి పాలనలో లేనందున ప్రతి మండల అభివృద్ధిలో ప్రత్యేకాధికారులు కీలకమని, అధికారులు తమ పరిధిలోని ప్రతి గ్రామాన్నీ సందర్శించి ప్రజా సమస్యలను తెలుసుకుని సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో పరిష్కరించే దిశగా కృషి చేయాలని తెలిపారు. వసతి గృహాలు, గురుకులాలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలను సందర్శించి మెనూ ప్రకారం విద్యార్థులకు అందించే ఆహారం, విద్యార్థుల హాజరు శాతం పరిశీలించాలని తెలిపారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. ఆర్‌బీఎస్‌కే బృందాలు గ్రామాలలో పర్యటించేలా చూడాలని, ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించే విధంగా విస్తృతస్థాయి ప్రచారం నిర్వహించి, ప్లాస్టిక్ వినియోగంతో కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. గ్రామపంచాయతీల్లో తడి, పొడి చెత్త ద్వారా తయారీతో అదనపు ఆదాయాన్ని పెంపొందించే విధంగా పంచాయతీ కార్యదర్శులు, గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్, సిర్పూర్ ఎమ్మెల్యే హరీశ్ బాబు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీసీఈవో లక్ష్మీ నారాయణ, మండల ప్రత్యేక అధికారులు, జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిర్దేశిత రుణ లక్ష్యాలను సాధించాలి

ఆసిఫాబాద్ టౌన్,సెప్టెంబర్ 19: బ్యాంకర్లకు నిర్దేశించిన ప్రకారం రుణ లక్ష్యాలను సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన 2024–25 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసిక సమీక్షా సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి దత్తారాం, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రాజేశ్వర్ జోషి, నాబార్డు అధికారి వీరభద్రుడుతో కలిసి బ్యాంకర్లు, సెర్ప్, మెప్మా అధికారులతో రుణ లక్ష్యాల సాధనపై సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో మొత్తం 6 771 స్వయం సహాయక సంఘాలకు 2,275 కోట్ల రుణ లక్ష్యం కాగా ఇప్పటివరకు రూ.777 కోట్లు అందించినట్లు తెఎలిపారు. మిగతా లక్ష్యాన్ని సాధించాలన్నారు. ప్రధానమంత్రి ముద్ర రుణాలు రూ.15 కోట్లు అందించనట్లు తెఎలిపారు. ఇప్పటివరకు స్వల్ప, దీర్ఘకాలిక రుణాలు 1,983 కోట్ల రూపాయలు అందించినట్లు తెలిపారు. ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.

మెడిసిన్‌పై అవగాహన ఉండాలి

మంచిర్యాల అర్బన్, సెప్టెంబర్ 19 : ప్రజలు వారు ఆరోగ్య రీత్యా వాడే మందులపై ఎలాంటి దృష్ఫలితాలు వస్తున్నాయి, ఏ వ్యాధికి ఏ మందులు వాడాలి అనే దానిపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని ప్రభుత్వ కళాశాల ప్రొఫేసర్, హెచ్‌వోడీ డా.జగతి అన్నారు. గురువారం నేషనల్ ఫార్మ కో విజిలెన్స్ వీక్ దినోత్సవాలను పురస్కరించుకొని వైద కళాశాల విద్యార్థులు మంచిర్యాల కాలేజ్ రోడ్డులో ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాల నుండి ఐబీ చౌరస్తాలో ప్రభుత్వ దవాఖాన వరకు ర్యాలీ తీశారు. ప్రభుత్వ దవాఖాన ఆవరణలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా.సులేమాన్, జీజీహెచ్ సూపరింటెండెంట్ హరీశ్‌చంద్రారెడ్డి, ఆర్‌ఎంవోలు భీష్మా, శ్రీమన్నారాయణ, ప్రొఫేసర్లు మనోజ్, సత్యేంద్ర పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో అభ్యంతరాలుంటే తెలుపాలి

నమస్తే నెట్‌వర్క్, సెప్టెంబర్ 19 : గ్రామ పంచాయతీ ఎన్నికల కోసం ఓటరు జాబితాలో చేయాల్సిన మార్పులు, చేర్పులు, అభ్యంతరాలుంటే ఈ నెల 21 లోపు దృష్టికి తీసుకురావాలని అధికారులు సూచించారు. గురువారం మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లోని అన్ని మండలాల్లో ఎంపీడీవో కార్యాలయాల్లో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఎంపీడీవోలు, ఎన్నికల అధికారులు సమావేశం నిర్వహించారు.

క్రీడలతో మానసికోల్లాసం

పోటీలను ప్రారంభిస్తున్న డీఎఫ్‌వో

ఆసిఫాబాద్ టౌన్, సెప్టెంబర్ 19:ఉద్యోగ జీవితంలో బిజీగా ఉన్న ఉద్యోగులకు క్రీడలు శారీరక మానసికోల్లాసం కలిగిస్తాయని జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్ కుమార్ టిబ్రేవాల్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని గిరిజన గురుకుల క్రీడా పాఠశాల మైదానంలో అటవీ శాఖ ఉద్యోగులకు నిర్వహించిన జిల్లా స్థాయి స్పోర్ట్స్ మీట్ కు కాగజ్ నగర్ ఎఫ్డిఓ సుశాంత్ సుఖదేవ్‌తో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జెండా ఆవిష్కరించి, జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అటవీ శాఖ క్రీడాకారులు జోనల్ స్థాయిలో పాల్గొంటారని వివరించారు. జిల్లావ్యాప్తంగా దాదాపు 200 మంది వివిధ స్థాయిల అటవీ ఉద్యోగులు పాల్గొన్న జిల్లా స్పోర్ట్స్ మీట్ లో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, టగ్ ఆఫ్ వార్, క్యారమ్స్, చెస్ తో పాటు అథ్లెటిక్స్ నిర్వహించారు. క్రీడలను జిల్లా గిరిజన క్రీడల అధికారి మీనారెడ్డి పర్యవేక్షించగా, పీడీలు మధుసూదన్, తిరుపతి, రాకేశ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని 11 రేంజ్ కార్యాలయాల ఎఫ్ఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ పట్టణంలో ర్యాలీ తీస్తున్న ముస్లింలు



చెన్నూర్‌లో రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఏసీపీ వెంకటేశ్వర్లు

ఘనంగా మిలాద్-ఉన్-నబీ వేడుకలు

నమస్తే నెట్ వర్క్, సెప్టెంబర్ 19 : మహ్మద్ ప్రవక్త పుట్టిన రోజును పురస్కరించుకొని మిలాద్-ఉన్-నబీ వేడుకలను మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో ముస్లింలు గురువారం ఘనంగా నిర్వహించారు. అన్ని మండలాల్లో ముస్లింలు ర్యాలీలు తీశారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పలు చోట్ల సేవా కార్యక్రమాలు రక్తదాన కార్యక్రమాలు నిర్వహించారు.

ఆదివాసీలకు అండగా పోలీసులు

• కుమ్రం భీం ఆసిఫాబాద్ ఎస్పీ డీ.వీ. శ్రీనివాసరావు

ఎస్పీకి వినతిపత్రం అందిస్తున్న ఆదివాసీ నాయకులు

కెరమెరి, సెప్టెంబర్ 19: ఆదివాసీలు ఆగ్రహ, ఆవేశాలకు లోనూ కాకుండా సమస్యల సాధనకు శాంతియుతంగా వస్తే పోలీసులు వారికి అండగా నిలుస్తూ తగిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ డీ.వీ. శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్ ఆవరణలో కెరమెరి, వాంకిడి ఆదివాసీ సంఘాల నాయకులతో శాంతి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..ఇటీవల జైనూర్‌లో ఆదివాసీ మహిళపై జరిగిన సంఘటన చాలా దారుణమన్నారు. దాడికి ప్రతి దాడులు చేయడం సరైన మార్గం కాదన్నారు. న్యాయపరమైన నిర్ణయాలతో ముందుకు వస్తే ఎంతటి వ్యక్తినైన చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడానికి పోలీసులు ఎప్పటికీ సిద్ధంగా ఉంటారని తెలిపారు. లైంగిక దాడికి యత్నించిన వ్యక్తిపై పీడీ యాక్ట్ నమోదు చేసి జీవితాంతం జైలులోనే గడిపేలా కఠినంగా శిక్షపడేలా చేస్తామని ఎస్పీ భరోసా కల్పించారు. నిషేధిత గంజాయి పదార్థాలు సాగు చేయడం, విక్రయించడం వంటి పనుల జోలికి వెళ్లకుండా మంచి మార్గంలో నడవాలని హితవు పలికారు. ఈ సందర్భంగా ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న చట్టాలను పకడ్బందీగా అమలు జరిగేలా చూడాలని పలు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని ఆదివాసీ సంఘాల నాయకులు ఎస్పీకి అందించారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ డీఎస్పీ కరుణకర్, వాంకిడి సీఐ సత్యనారాయణ, ఎస్‌బీ సీఐ రాణాప్రతాప్, కెరమెరి, వాంకిడి ఎస్ఐలు గుంపుల విజయ్, ప్రశాంత్, రామారావ్, మాజీ ఎంపీపీ పెందోర్ మోతీరాం, జడ్పీటీసీ సెడ్మాకి దుర్పతాబాయి, ఆదివాసీ సంఘాల నాయకులు కోవ విజయ్ కుమార్, కనక ప్రభాకర్, భరత్ భూషణ్, లక్ష్మణ్‌రావ్, అంబారావ్, కోవ ఇందిరా, భీంరావ్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

బాధితురాలికి ఎమ్మెల్యే కోవ లక్ష్మి పరామర్శ

బాధితురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్,సెప్టెంబర్ 19: లైంగికదాడి యత్నానికి గురైన జైనూర్ మండలానికి చెందిన ఆదివాసీ మహిళ ను ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి పరామర్శించారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీ హాస్పిటల్‌కి చేరుకుని ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితిని గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. బాధిత మహిళను ఆదుకుంటామని, అండగా ఉంటామని భరోసా కల్పించారు. ధైర్యంగా ఉం డాలని కుటుంబ సభ్యులకు సూచించారు.

రాష్ట బంద్‌ను విజయవంతం చేయాలి

కాసిపేట, సెప్టెంబర్ 19 : కుమ్రం భీం జిల్లా జైనూర్‌లో జరిగిన ఘటనలో బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆ ఘటనకు వ్యతిరేకంగా ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 21న తుడుందెబ్బ రాష్ట్ర బంద్‌కు పిలుపునిస్తున్నట్లు నాయక్‌పోడ్ సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి కొమ్ముల బాపు పేర్కొన్నారు. గురువారం కాసిపేట మండలంలోని దేవాపూర్‌లో నిర్వహించిన సమావేశంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ టౌన్,సెప్టెంబర్19: జైనూర్ ఘటనలో బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 21న నిర్వహించ తలపెట్టిన రాష్ట్ర బంద్ విజయవంతం చేయాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షులు కోవ విజయ్ కుమార్ కోరారు. గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు తదితరులున్నారు.

టాస్క్‌పై అవగాహన

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 19: కాగజ్‌నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు టాస్క్‌పై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. టాస్క్ ఫ్యాకల్టీ సభ్యుడు సాయి, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్‌పై శిక్షణతో పాటు దాని ప్రాధాన్యత, భవిష్యత్‌లో కలిగే ప్రయోజనాలు, సంబంధించిన విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్ దత్తాత్రేయ, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీనరసింహం, అధ్యాపకులు జనార్దన్, పాల్గొన్నారు.

దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్ కల్పించాలి

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 19 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఎంఎస్‌ఎంఈ 2024 పాలసీలో దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్ కల్పించాలని ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షుడు పండు రాజేశ్, కార్యదర్శి ముంజం ఆనంద్ డిమాండ్ చేశారు. 2016 ఆర్‌పీడీ చట్టానికి భిన్నంగా పాలసీ ఏర్పాటు చేయడం సరికాదన్నారు. 43 లక్షల మంది దివ్యాంగుల గురించి పట్టించుకోవాలన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

బెజ్జూర్, సెప్టెంబర్ 19 : మండల కేంద్రంలోని గుమ్మల శ్రీనివాస్ అనే అతని ఇల్లు గురువారం రాత్రి షార్ట్ సర్క్యూట్ తో కాలి దగ్ధమైంది. రూ.2 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు. అధికారులు నష్ట పరిహారం, ప్రభుత్వం సహాయం అందించాలని బాధితుడు కోరారు. ఎమ్మెల్సీ దండె విఠల్ మండల నాయకుల ఆధ్వర్యంలో శ్రీనివాస్ కాలిన ఇంటిని పరిశీలించారు. శ్రీనివాస్‌కు రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అర్షద్ హుస్సేన్, రాచకొండ శ్రీవర్ధన్, జావీద్ అలీ ఖాన్, సురేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి

ఆసిఫాబాద్ టౌన్,సెప్టెంబర్ 19: ఆర్టీసీకి ప్రభుత్వం నిధులు కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీ మేరకు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ గురువారం ఆర్టీసీ కార్మికులతో కలిసి డిపో ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ జేఏసీ చైర్మెన్ టి. దివాకర్ గౌడ్, ఆర్టీసీ జాక్ నాయకులు అశోక్, ఇజాజ్, అలీ, శ్రీధర్, శ్రీనివాస్, లక్ష్మణ్, సురేశ్, రాంకుమార్, ఆనంద్ రావు, పోశం, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు